క్లుప్తంగా

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో 49, 50, 51 వార్డులకు సంబంధించి కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌ రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్‌ ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ అందిస్తారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడు నెలల పాటు జరగనున్న శిక్షణలో మూడు వార్డుల్లోని మహిళలు రోజుకు ఒక బ్యాచ్‌లో 30 మంది, రెండు బ్యాచ్‌ల్లో 60 మంది శిక్షణ పొందుతారన్నారు. కార్యక్రమంలో జోన్‌–5 కమిషనర్‌ బి.రాము, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం, యోగాసనాల పోటీల్లో ప్రతిభ



గీసిన చిత్రాలు చూపిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

సీతంపేట: ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్‌ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు సోమవారం చిత్రలేఖనం, యోగాసనాల పోటీలు నిర్వహించారు. ఎ.హర్షిణి, తులసి, మహాలక్ష్మి, చరణ్‌, హర్షవర్ధన్‌, యుగంధర్‌ ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం రాధాకుమారి, ఎన్‌సీసీ చీఫ్‌ ఆఫీసర్‌ ఎం.ఎస్‌.వి.విశ్వనాథం, పాఠశాల కమిటీ చైర్మన్‌ అప్పలరాజు, కమిటీ సభ్యుడు అమరాన వెంకటరమణ అభినందించారు.

రైల్వేస్టేషన్‌లో 12 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: మద్దిపాలెం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్‌ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌ సిహెచ్‌.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఆర్పీఎఫ్‌ ఎస్‌ఐ సూరజ్‌కుమార్‌ (మద్దిపాలెం), జీఆర్పీ ఎస్‌ఐ కె.శాంతారాం తమ సిబ్బందితో కలిసి వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. కోరాపుట్‌ జిల్లా పాడువకు చెందిన ఈశ్వర్‌ కాముడి మద్దిపాలెం రైల్వేస్టేషన్‌కు గంజాయిని అక్రమంగా తీసుకురావడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకుని, రూ.60 వేల విలువైన 12 కిలోల గంజాయిని సీజ్‌ చేశారు. నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

చదరంగం శిక్షణకు విశేష స్పందన



చెస్‌ ఆడుతున్న విద్యార్థులు

మురళీనగర్‌: మురళీనగర్‌ వాకర్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచితంగా నిర్వహిస్తున్న చదరంగం శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. చిన్నారుల మెదడుకు పదును పెట్టే ఈ క్రీడలో అనుసరించాల్సిన ఎత్తులు, పైఎత్తులపై శిక్షకుడు ఎస్‌.ఉమాపతి విద్యార్థులకు వివరిస్తూ సాధన చేయిస్తున్నారు. శిక్షణకు విశేష స్పందన లభించడంతో సోమవారం నాటికి 72 మంది చిన్నారులు పాల్గొని చదరంగం నేర్చుకుంటున్నారు. ఈ నెల 7 వరకు ప్రతి రోజూ సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు శిక్షణ నిర్వహిస్తామని వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్ష, కార్యదర్శులు సనపల భానుప్రకాష్‌, సీహెచ్‌ఎస్‌ఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. వివరాలకు 76598 04633, 94912 92369 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

అన్న క్యాంటీన్‌ను సందర్శించిన జెడ్సీ

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు ఆర్‌ అండ్‌ బీ జంక్షన్‌ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను సోమవారం జోన్‌–5 కమిషనర్‌ బి.రాము సందర్శించారు. అక్కడ ఆయన అల్పాహారం తిని ఆహార నాణ్యతను క్యాంటీన్‌కు వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. 380 మంది వరకు అల్పాహారం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆహారం అందించాలని, దానికి తగ్గ ఏర్పాటు చేసుకోవాలని వారికి జెడ్సీ రాము సూచించారు.

విజ్ఞాన ప్రాప్తిరస్తు

- వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్న చిన్నారులు
- గ్రంథాలయంలో ఉత్సాహంగా పుస్తక పఠనం, యోగా సాధన
- శిబిరంలో అర్థవంతంగా ఆటవిడుపు



మురళీనగర్‌ గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

మురళీనగర్‌: వేసవి సెలవులంటేనే విద్యార్థుల్లో అంతులేని ఉత్సాహం వస్తుంది. ఏడాది పాటు చదువులో బిజీగా ఉండి ఎంతో ఒత్తిడిని ఎదుర్కునే చిన్నారులకు వేసవి సెలవులు ఒక ఉపశమనం కల్పిస్తాయి. తల్లిదండ్రులతో కలిసి విహార యాత్రలకు, సొంతూళ్లకు వెళ్లి సరదాగా గడపడానికి ఇదో అవకాశం. ఎక్కడికి వెళ్లినా సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రధానం. ఇందులో భాగంగా వీరు తమకు ఆసక్తి ఉన్న అంశాల్లో శిక్షణ తీసుకుంటారు. ఈ మేరకు గ్రంథాలయంలో చిన్నారులకు కోసం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. లైబ్రరీకి వెళ్లడం వల్ల తాము ఎన్నో నేర్చుకున్నామని పలువురు విద్యార్థులు తెలియజేశారు. వేసవి శిబిరంలో విజ్ఞాన సముపార్జనతోపాటు ఆటవిడుపు అర్థవంతంగా జరుగుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

20 అంశాల్లో శిక్షణ

మురళీనగర్‌ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయలో ఏప్రిల్‌ 28 నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో చిన్నారులకు 20 రకాల అంశాల్లో శిక్షణ ఇచ్చారు. డ్రాయింగ్‌, పేపర్‌క్రాఫ్ట్స్‌, పుస్తక పఠనం, పద్య పఠనం, క్యారమ్స్‌, మ్యూజికల్‌ చైర్‌ ఆటలు, పెయింటింగ్‌, క్విజ్‌ పోటీలు, లెమన్‌–స్పూన్‌, పరుగు పందెం, డ్యాన్స్‌ పోటీలు, ఇతిహాసాల పఠనం, గణిత ఫార్ములాలు, జ్ఞాపకశక్తి పరీక్షలు, భగవద్గీత పఠనం, కలర్‌ రిబ్బన్‌ ఆర్ట్‌, స్టోరీ టెల్లింగ్‌, జనరల్‌ నాలెడ్జ్‌, యోగా శిక్షణ, ఫిజిక్స్‌ ఫార్ములాలు, గణితంలో ఆటలు వంటి అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని వారికి నచ్చిన వాటిలో నైపుణ్యం సాధించారు.



యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



మురళీనగర్‌ లైబ్రరీలో పుస్తకాలు

పిల్లలు మెచ్చిన పుస్తకాలు

విద్యార్థులు లైబ్రరీలో తమకు నచ్చిన పుస్తకాల జాబితాను వెల్లడించారు. భవిష్యత్‌లో మరిన్ని పుస్తకాలు ఏర్పాటు చేయాలని కోరారు. చందమామ కథలు, పంచతంత్ర కథలు, రామాయణ, దశావతారాలు, బేతాళ కథలు, పిల్లలు మెచ్చిన కథలు, బాలమిత్ర కథలు, గొప్పల కప్ప కథ, అమ్మ చెప్పిన కథలు తమకు నచ్చాయని బాలికలు తెలియజేశారు. తాతయ్య చెప్పిన కథలు, తెనాలి రామకృష్ణ, అక్బర్‌ బీర్బల్‌ కథలు, జట్కా టైల్స్‌, వికాస్‌ స్టోరీస్‌, వండర్‌ఫుల్‌ స్టోరీలు, ఫన్నీ స్టోరీస్‌, చందమామ కథలు, పంచతంత్ర కథలు, జోక్స్‌ అండ్‌ జోక్స్‌ పుస్తకాలు తమకు నచ్చాయని బాలురు చెప్పారు.

పాఠశాల లైబ్రరీల్లో కథల పుస్తకాలు పెట్టాలి



పాఠశాలల్లో పిల్లల కోసం కథల పుస్తకాలు ఎక్కువగా అందుబాటులోకి తేవాలి. పంచతంత్ర కథలంటే నాకు చాలా ఇష్టం. పుస్తక పఠనం వల్ల మంచి ఆలోచనలు వస్తాయి. స్థిరత్వం, ఓపిక అలవాటవుతుంది. కథలు చెప్పగలుగుతున్నాను.

– పి.సుబ్రహ్మణ్యం, 6వ తరగతి

పైసా ఖర్చు లేకుండా విజ్ఞానం



ఉచితంగా విజ్ఞానాన్ని అందించే ఏకైక సంస్థ ఒక గ్రంథాలయం మాత్రమే. వీటిలో పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి. పుస్తక పఠనం ద్వారా మాత్రమే పిల్లల్లో అంతర్గత సామర్థ్యాలు పెంపొందించగలం. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రతి ఆదివారం గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేయాలి.

– జి.ఎస్‌.ఎన్‌.మూర్తి, యోగా టీచర్‌

సమయపాలన అలవాటైంది



గతంలో ఉదయం చాలా ఆలస్యంగా నిద్ర లేచేవాడిని. ఇప్పుడు వేకువజాము 5.30 గంటలకే నిద్ర లేచి 7 వరకు ఇంటి దగ్గర చదువుకుని 9 గంటలకు లైబ్రరీకి వస్తున్నాను. నీతి, నిజాయితీ, నిజం పలకడం వంటి అంశాలకు సంబంధించిన విలువలను పుస్తక పఠనం ద్వారా తెలుసుకున్నాను.

– బి.దుర్గాలలిత్‌ కిషోర్‌, మురళీనగర్‌

స్నేహభావం అలవడింది



వేసవి శిబిరంలో పాల్గొనడం వల్ల నాలో స్నేహభావం అలవడింది. గతంలో ఇతరులతో మాట్లాడేందుకు జంకే దాన్ని. ఇప్పుడు అందరితో ఎలా ఉండాలో నేర్చుకున్నాను. పుస్తక పఠనంతో మైండ్‌ షార్ప్‌గా తయారైంది. యోగా చేస్తున్నాను. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను.

– పి.ప్రియాంక, 8వ తరగతి

తోటివారికి సాయపడాలి



గ్రంథాలయానికి రావడం వల్ల నాలో చాలా మార్పు వచ్చింది. నీతి కథలు చదవడం వల్ల తోటివారికి సాయపడాలనే భావన ఏర్పడింది. నాకు తెలుగంటే ఇష్టం. కథల ఖజానా, పిల్లలు మెచ్చిన కథలు, రామాయణం, దశావతారాలు, భాగవతం వంటి తెలుగు పుస్తకాలు చదివాను.

– పి.దేవయాని, 8వ తరగతి

చిన్నారుల భవితకు గ్రంథాలయాలు పునాది



నేటి బాలలు భావితరాలకు మన చరిత్ర, వారసత్వం అందించే వారసులు. మన గత చరిత్ర, మారుతున్న సాంకేతికత తెలుసుకోవాలంటే చిన్నారులు గ్రంథాలయాలకు రావాలి. అన్ని రకాల అంశాలను పిల్లలకు పరిచయం చేసేందుకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నాం. ఇంతవరకు 250 మంది విద్యార్థులు శిబిరంలో పాల్గొన్నారు. వారికి అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాం.

– వై.పద్మజ, లైబ్రేరియన్‌, మురళీనగర్‌

ఎన్సీఆర్సీ జాతీయ ఉపాధ్యక్షుడిగా 'దాడి'



దాడి సత్యనారాయణకు నియామక పత్రం అందిస్తున్న చైర్మన్‌ నాగేశ్వరరావు

తాటిచెట్లపాలెం: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్‌(ఎన్‌సీఆర్‌సీ) జాతీయ ఉపాధ్యక్షుడిగా జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్‌ దాడి సత్యనారాయణ నియమితుడయ్యారు. బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని సింధూర ఫంక్షన్‌ హాల్‌లో కమిషన్‌ ఆధ్వర్యంలో సోమవారం వినియోగదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎన్‌సీఆర్‌సీ జాతీయ స్థాయి వ్యవస్థాపకుడు, చైర్మన్‌ ఎం.వి.ఎల్‌.నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్‌ దేశవ్యాప్తంగా వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచడం, వాటిని కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దాడి సత్యనారాయణకు నియామక పత్రాన్ని అందజేశారు. విశాఖ జిల్లాలోని 30 మంది సభ్యులను వివిధ పదవుల్లో నియమించారు. కార్యక్రమంలో ఎన్సీఆర్సీ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్‌ ఎం.ప్రసాద్‌(మెడికల్‌, ఫుడ్‌ సేఫ్టీ), రాష్ట్ర చైర్మన్‌ బల్ల శ్రీనివాస్‌, రాష్ట్ర చైర్మన్‌(ఆపరేషన్స్‌, అబ్జర్వర్‌) డాక్టర్‌ అవినాష్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నైదాన ప్రసాద్‌, సాయిశ్రీనివాస్‌, టి.రాము, సూర్యప్రకాష్‌, మల్లవరపు శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వనితా వాయిస్‌ పత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్‌ గద్దెయ్య, క్లబ్‌ సభ్యులు

మురళీనగర్‌: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని విద్యావేత్త, పరిశోధకుడు డాక్టర్‌ గద్దెయ్య పిలుపునిచ్చారు. వనితా వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి, బదులుగా నూలు, గుడ్డ సంచులు వాడాలని సూచించారు. మహిళలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం వనితా వాయిస్‌ పత్రికను ఆయన ఆవిష్కరించారు. భవిష్యత్‌ సేవా కార్యక్రమాల నిర్వహణపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ గద్దెయ్యను సత్కరించారు. ఈ నెలలో పుట్టిన రోజు జరుపుకుంటున్న సభ్యులకు చిరుకానుకలు అందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్‌–101 ఆర్‌సీ–5 ఉప్పలపాటి సుభ, క్లబ్‌ పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి, జాలీవాకర్‌ ఎ.లీలావతి, వనితా వాయస్‌ ఎడిటర్‌ సిహెచ్‌.పద్మావతి, జాయింట్‌ సెక్రటరీ ఎం.ప్రమీలారావు, జి.మంగాదేవి, కె.బిందురాణి పాల్గొన్నారు.

కొలువుదీరిన బీవీపీ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న బీవీపీ నూతన కార్యవర్గ సభ్యులు

సీతంపేట: భారత్‌ వికాస్‌ పరిషత్‌(బీవీపీ) విశాఖపట్నం శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో జరిగింది. అధ్యక్షుడిగా సిహెచ్‌.వి.సత్యనారాయణ, కార్యదర్శిగా పి.భాస్కరరావు, కోశాధికారిగా జి.ఎస్‌.వి.మాణిక్యాలరావు ప్రమాణ స్వీకారం చేశారు. పరిషత్‌ దక్షిణ విభాగం సంపర్క్‌ రీజనల్‌ కార్యదర్శి ఎస్‌.గోపాలరావు ఎన్నికల అధికారిగా వీరిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఏయూ మాజీ రిజిస్ట్రార్‌ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీవీపీ ప్రాంత్‌ పూర్వ అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు, ప్రతినిధులు రమేష్‌ చంద్‌జైన్‌, ఆచార్య పి.ఎస్‌.అవధాని, ఎంవీవీ సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్‌, ఎస్‌.నిర్మల, పంపాన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలు, పిల్లలకు వేసవి శిక్షణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మహిళలు

మురళీనగర్‌: మాధవధార మహిళా వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షురాలు కె.మాధవి ఆధ్వర్యంలో సోమవారం పిల్లలు, మహిళలకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. మురళీనగర్‌ బ్యాంకు వీధిలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని డిస్ట్రిక్ట్‌–101 గవర్నర్‌ కె.ద్వారకానాథ్‌ ప్రారంభించారు. చీరలపై పెయింటింగ్‌, బ్లౌజులపై 3డీ పెయింటింగ్‌ను మహిళలకు టీచర్‌ సుమలత వివరించారు. ఇందుకు అవసరమైన వస్తువుల వివరాలు తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని మాధవి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్‌ కార్యదర్శి పి.కమల, జాలీ వాకర్‌ కె.సుగుణ, బులిటెన్‌ ఎడిటర్‌ డి.శిరీష, ఎ.రాధ, ఎ.మాధవీలత, పి.తులసి, మహిళలు పాల్గొన్నారు.

'కూటమి' అసమర్థతను ఎండగడదాం

- 4న 'వెన్నుపోటు దినం' నిరసనను విజయవంతం చేద్దాం
- డిప్యూటీ మేయర్‌ కటుమూరి సతీష్‌, వైఎస్సార్‌సీపీ నేతల పిలుపు



వెన్నుపోటు దినం పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్‌ కటుమూరి సతీష్‌



45వ వార్డులో పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న పైడి రమణ తదితరులు



వెన్నుపోటు దినం పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ముvvల పోలారావు, సంపంగి శ్రీనివాసరావు



51వ వార్డులో పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న రెయ్యి వెంకటరమణ

తాటిచెట్లపాలెం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, చంద్రబాబు దగాకోరు పాలనపై నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌ కటుమూరి సతీష్‌ పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం 47వ వార్డు కప్పరాడలో పార్టీ నాయకులతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చకపోగా ప్రజలను మోసం చేసిందన్నారు. దీనికి నిరసనగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు నాయకత్వంలో ఈ నెల 4న జరిగే నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని కోరారు. పార్టీ వార్డు శ్రేణులు కుందిరి సుకుమార్‌, వీర రాఘవులు, జగజీవన్‌రామ్‌, కృప, బంగారి సురేష్‌, లక్ష్మి(జాయ్‌), చందురెడ్డి, సుధాకర్‌, అనిల్‌, కనకరాజు, సాయి, నాగరాజు, బుల్లిబాబు, రమేష్‌, రవీంద్ర, రాము, లక్ష్మి, ప్రశాంతి, సంతోషి, సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.

నిరసనను జయప్రదం చేద్దాం

వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ పిలుపునిచ్చారు. తాటిచెట్లపాలెంలో పార్టీ నాయకులతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరించారు. నానిబాబు, ముప్పిడి రామారావు, వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎస్టీ సెల్‌ అధ్యక్షుడు నల్లబోతుల సతీష్‌, జోగినాయుడు, దుర్గేష్‌, కాయల నరసింగరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజం

సీతంపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ 25వ వార్డు నాయకుడు, మాజీ కార్పొరేటర్‌ ముvvల పోలారావు విమర్శించారు. పార్టీ నాయకులు సంపంగి శ్రీనివాసరావు, ముvvల సంతోష్‌కుమార్‌తో కలిసి శాంతిపురంలో వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ నాయకులు వేంపాడ నూకరాజు, జోరీగల గణేష్‌, ఈగల గోవింద్‌, బొట్టా పైడిరాజు, బొట్టా నాగు, సింహాచలం, సన్యాసిరావు, ప్రసాద్‌, ముద్దాడ అశోక్‌, రామారావు, సోంబాబు, వాసు, బాషా, ఆవుపాటి రాజా, బొట్టా శ్రీను, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

హామీలు గాలికొదిలేశారు..

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్‌ ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణ పార్టీ నాయకులతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మాజీ డైరెక్టర్‌ పైడి శ్రీనివాసరావు, పొన్నాడ అప్పారావు, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హామీలిచ్చి ఏడాదైనా.. అమలు శూన్యం



25వ వార్డులో పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు భోగవిల్లి గోవింద్‌

సీతంపేట: కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదైన అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ 25వ వార్డు నాయకుడు భోగవిల్లి గోవింద్‌ అన్నారు. గణేష్‌నగర్‌లోని తన కార్యాలయం వద్ద వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో హామీలు, సూపర్‌ సిక్స్‌ పథకాలంటూ ఊదరగొట్టిన చంద్రబాబు, నేటికీ ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. పార్టీ నాయకులు సంపంగి శ్రీనివాసరావు, సారిపిల్లి సంతోష్‌, పోతుబంతి హరికృష్ణ, బొమ్మాళి రవి, నూకరాజు, కొమ్ము నాగు, ముద్దాడ అశోక్‌, శేఖర్‌, సూరిబాబు, గుమ్మడి గోపి, సిద్ధు, పవన్‌ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మహారాణిపేట: అనధికార నిర్మాణం చేపడుతున్న బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాధవధారవాసి మూల శ్యామలరావు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. మాధవధారలోని తమ ఇంటిని ఆనుకుని ఉన్న 120 గజాల స్థలంలో బిల్డర్‌ గ్రూప్‌హౌస్‌ నిర్మిస్తున్నారని తెలిపారు. తమ స్థలాన్ని ఆక్రమించి సెట్‌ బ్యాక్స్‌ ఏమీ వదలకుండా నిర్మాణం చేపట్టడం వల్ల భవిష్యత్తులో ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. జీవీఎంసీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, బిల్డింగ్‌ ప్లాన్‌కు అనుమతి లేకుండా పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. రెండు వారాలుగా జీవీఎంసీ దృష్టికి తీసుకువెళ్లినా ఏ చర్యలు తీసుకోలేదని వాపోయారు.

హై ఓల్టేజ్‌తో కాలిపోయిన గృహోపకరణాలు



శ్రీనివాసనగర్‌లో కాలిపోతున్న సర్వీస్‌ వైర్లు

సీతంపేట: ఒక్కసారిగా హై ఓల్టేజ్‌తో ఎలక్ట్రికల్‌ గృహోపకరణాలు కాలిపోయాయి. 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని కర్రివాని బ్రిడ్జి వద్ద సాయిబాబా ఆలయానికి ఎదురుగా ఉన్న వీధిలో సోమవారం ఉదయం ఒక్కసారిగా హై ఓల్టేజి రావడంతో ఇళ్లల్లోని సీలింగ్‌ ఫ్యాన్లు, లైట్లు, టీవీలు దగ్ధమయ్యాయి. ఇటీవల కొద్ది రోజులుగా విద్యుత్‌ సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తున్నాయని, సోమవారం హై ఓల్టేజ్‌ రావడంతో టీవీలు పేలిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లల్లో రెండేసి సీలింగ్‌ ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, బల్బులు కాలిపోయి చాలా నష్టపోయామని మహిళలు వాపోయారు. విద్యుత్‌ స్తంభానికి గృహాలకు విద్యుత్‌ సరఫరా చేసే సర్వీస్‌ వైర్లు సైతం మంటలు వచ్చి కాలిపోయాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.